క్లుప్తంగా

రక్తదానంతో.. ప్రాణదానం



రక్తదాన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న సిద్ధేశ్వరరావు

ప్రొద్దుటూరు: రక్తదాతలు ప్రాణదాతలతో సమానమని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సిద్ధేశ్వరరావు అన్నారు. వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీలో మంగళవారం రెడ్ క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 38 మంది విద్యార్థులు, అధ్యాపకులు రక్తదానం చేశారు. 36 సార్లు రక్తదానం చేసిన నెట్ వర్క్ అడ్మినిస్ట్రేటర్ జి.భువనేశ్వర్‌రెడ్డిని, 27 సార్లు రక్తదానం చేసిన ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్ జి.రామాంజనేయరెడ్డిని, 12 సార్లు రక్తదానం చేసిన విద్యార్థి జి.అశోక్‌ను ప్రిన్సిపాల్ సిద్ధేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ ఎం.రజనీకాంత్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కడప చైర్మన్ జి.శివశకర్‌రెడ్డి, నెహ్రూ యువకేంద్రం జిల్లా యూత్ ఆఫీసర్ మణికంఠ రెడ్డి, కడప రిమ్స్ డాక్టర్ యశస్విరెడ్డి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు రామాంజనేయరెడ్డి, శ్రీనివాసులు, హెచ్ఓడీలు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మొక్కలతోనే ప్రాణవాయువు



మొక్కలను నాటుతున్న ప్రిన్సిపాల్ నారాయణరెడి తదితరులు

మైదుకూరు: మొక్కలు స్వచ్ఛమైన ప్రాణవాయువును అందిస్తాయని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంప్‌లో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని భూమాయపల్లె గ్రామంలో మంగళవారం మొక్కలు నాటడం, పరిసరాలను శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, కళాశాల అధ్యాపకులు స్థానికులకు మొక్కలు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల అనేక లాభాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ తమ గ్రామాన్ని శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీడ నిచ్చే మొక్కలను ఎక్కువగా పెంచడం వలన భూతాపం తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సుబ్బరాయుడు, నవనీశ్వర్‌రెడ్డి, కేశవ, స్థానిక యువకులు జితేంద్ర, నాని, పవన్ పాల్గొని విద్యార్థులకు అవసరమైన సామాగ్రి, పనిముట్లను అందజేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రొద్దుటూరు కల్చరల్: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని లేపాక్షి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని భగత్ సింగ్ కాలనీలో మంగళవారం లేపాక్షి డిగ్రీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి.. పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలను నాటి పరిరక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ పీఓ పుల్లయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాలపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్: ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరుగుతున్న పరీక్ష కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు జగన్, పీఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ జమ్మలమడుగు, మైదుకూరు, పోరుమామిళ్ల, కమలాపురం నాలుగు పరీక్ష కేంద్రాల్లో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలను 27,858 మంది రాస్తున్నారని తెలిపారు. మాస్ కాపీయింగ్ కోసం ఒక్కో విద్యార్థి నుంచి ఓపెన్ స్కూల్ నిర్వాహకులు డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మాస్ కాపీయింగ్ జరగకుండా పరీక్షలు నిర్వహించాలని ఈనెల 14న డీఈఓ అనురాధకు వినతి పత్రం ఇచ్చామన్నారు. ఓపెన్ స్కూల్ నిర్వాహకుడు లక్ష్మిరెడ్డి తమను బెదిరించారని, చర్యలు తీసుకోవాలని కోరారు.

గేట్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న అధ్యాపకులు

ప్రొద్దుటూరు కల్చరల్: మండల పరిధిలోని గౌతమి మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు గేట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ రామసుబ్బమ్మ తెలిపారు. ఈసీఈ నాలుగో సంవత్సరం విద్యార్థిని జ్యోతి, ఈఈఈ నాలుగో సవంత్సరం విద్యార్థిని కృష్ణవేణి గేట్‌లో ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. వారిని కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్లు నాగూర్, రవీంద్రారెడ్డి, కో డైరెక్టర్ శైలూషా, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రావు అభినందించారు.

అభివృద్ధి చేసి ఓట్లు అడుగుతున్నాం

- ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



నేతన్నతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు: గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి చేశామని, అభివృద్ధిని ప్రజలకు వివరించి ఓట్లు అడుగుతామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 38వ వార్డు కౌన్సిలర్ పల్లా రమాదేవి ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే రాచమల్లు, ఆయన సతీమణి రాచమల్లు రమాదేవి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేగా రాచమల్లు శివప్రసాదరెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రత్యర్థి రాజకీయ పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయొద్దని, ఆదర్శవంతమైన ప్రచారాన్ని నిర్వహించాలని కోరారు. రెండోసారి తాను ఎమ్మెల్యే అయ్యాక వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇచ్చిన మాట ప్రకారం రూ.150 కోట్లతో తాగునీటి పథకాన్ని పూర్తి చేసి రోజూ నీటిని అందిస్తున్నానని తెలిపారు. మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.130 కోట్లతో మౌలిక సదుపాయలు కల్పించామన్నారు. రూ.160 కోట్లతో మురికి కాలువల ఆధునీకరణ, రూ.120 కోట్లతో కొత్త పైపులైన్ నిర్మిస్తున్నామని వివరించారు.

వరదరాజులరెడ్డిపై విమర్శలు

కరోనా సమయంలో రూ.2.5 కోట్లు వెచ్చించి ముస్లింలకు రంజాన్ తోఫా, క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలను అందించామని గుర్తుచేశారు. ఆ సమయంలో మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఇంట్లో నుంచి బయటికి రాలేదని విమర్శించారు. అర్హులైన 24 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామని తెలిపారు. నాలుగున్నరేళ్లు కనిపించని వరదరాజులరెడ్డి ఎన్నికలు వచ్చే సరికి బయటికి వచ్చారని విమర్శించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి పల్లా సురేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైస్ చైర్మన్లు బంగారు మునిరెడ్డి, ఆయిల్ మిల్లు ఖాజా, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ జేష్ఠాది శారద, బీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు మురళి, చౌడం రవిచంద్ర, తుపాకుల వెంకటరమణ, మాజీ కౌన్సిలర్ పాతకోట కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షురాలు సునంద, కౌన్సిలర్లు లక్ష్మీదేవి, రావులకొల్లు అరుణ, కమాల్, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, పిట్టా బాలాజీ, కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున ప్రసాద్, ఎంపీటీసీ మేరి, అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రామలక్ష్మి సుబ్బయ్య, ఎంపీపీ శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రాచమల్లును కలిసిన ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు

ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటిస్తా

ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పకుండా పాటిస్తానని రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రకటించారు మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారుల అనుమతి తీసుకుని ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. మంగళవారం అధికారులు చెప్పిన వెంటనే ఎన్నికల ప్రచారాన్ని ఆపేశామని తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆర్యవైశ్య యువజన సంఘం

పట్టణ ఆరోగ్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు గాజులపల్లి అభినయ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా అభినయ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ తరపున రాచమల్లు శివప్రసాదరెడ్డికి, టీడీపీ తరపున నంద్యాల వరదరాజులరెడ్డికి టికెట్లు కేటాయించినందుకు వారికి అభినందనలు తెలిపామన్నారు. తమ కోరిక మేరకు ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి తన ఫొటోలను బహిర్గతం చేయలేదని, కానీ టీడీపీ నేతలు మాత్రమే ఆర్యవైశ్య యువజన సంఘం మద్దతు ఇచ్చినట్లు ట్రోల్స్ చేశారని తెలిపారు. ఈ కారణంగా రెండోసారి మీడియా సమక్షంలో తాము ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపి విషయం చెబుతున్నామన్నారు. తాము ఏ పార్టీకి మద్దతు ఇవ్వలేదని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తనకు శుభాకాంక్షలు తెలిపిన యువకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పోషకాహారంతో ఆరోగ్యం పదిలం



సూచనలు ఇస్తున్న సీడీపీఓ సావిత్రమ్మ

దువ్వూరు: పోషకాహారం తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉండవచ్చని సీడీపీఓ సావిత్రమ్మ పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారాన్ని తప్పకుండా తీసుకోవాలన్నారు. మంగళవారం దువ్వూరులోని కేకే స్ట్రీట్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం మార్చి నెల 9 నుంచి 23 వరకు పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. పోషకాహారం తీసుకుంటే పిల్లల్లో పెరుగుదల బాగుంటుందని, ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు రుహి, ఆయేషా, లీలావతి, సునీత, ప్రసన్న, రమాదేవి, సుభద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో మెరుగైన వైద్యం



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ రాజేష్

దువ్వూరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని డిప్యూటీ డీఎంహెచ్ఓ రాజేష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నీలాపురం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. వైద్య శిబిరానికి వచ్చే ప్రజలకు వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. శిబిరానికి వచ్చిన 320 మంది రోగులకు వైద్యులు సురేష్ బాబు, హేమలత, యశస్వి, నాగయ్య, తేజ బీపీ, షుగర్, థైరాయిడ్, కంటి సంబంధించిన వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు రాజగోపాల్, సువర్ణ, విజయకుమారి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆస్పత్రిని సందర్శించిన చిన్నజీయర్‌స్వామి



నూతన ఆస్పత్రిలో చిన్నజీయర్‌స్వామి

బద్వేలు అర్బన్: పట్టణంలో గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారు శీనయ్య, నగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రమణమ్మ కుమారుడు డాక్టర్ జి.రాహుల్ ఆధ్వర్యంలో నూతనంగా 'బంగారు శీనయ్య' ఆస్పత్రిని నిర్మించారు. బుధవారం ఆస్పత్రిని ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆస్పత్రిని ప్రముఖ వేద గురువు శ్రీ త్రిదండి రామానుజ చిన్నజీయర్‌స్వామి సందర్శించారు. ఆస్పత్రి దినదినాభివృద్ధి చెంది ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఆశీర్వదించారు. తొలుత ఆస్పత్రి నిర్వాహకులు స్వామిని సత్కరించారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ గురుమోహన్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కె.వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం పంపిణీలో జాగ్రత్త వహించాలి

ముద్దనూరు : అంగన్‌వాడీలలో రక్తహీనతను నివారించడానికి పోషకాహారాన్ని అందించడంలో సిబ్బంది జాగ్రత్త వహించాలని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయాన్ని ఆమె సందర్శించి పీడీ ఫెడ్ స్టాల్స్‌ను పరిశీలించారు. కిశోరబాలికల సమాచారం అందుబాటులో వుండాలని, ఆప్ ద్వారానే పోషకాహార సరుకులు అందించాలని, ఐరన్ సిరప్‌ను నమోదుచేయాలని సూచించారు. మహిళలు, పిల్లల సంరక్షణకోసం వున్న హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో ముంతాజ్‌బేగం, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

బి.కోడూరు: రెండో రోజు పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. మంగళవారం మండలంలో 194 మంది విద్యార్థులు హిందీ పరీక్ష రాసినట్లు ఎంఈఓ సురేష్‌కుమార్ తెలిపారు. విద్యార్థులకు పరీక్ష సమయంలో తాగునీరు, పరీక్షా కేంద్రాలకు బస్సుల ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. బి.కోడూరు పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ కవాతు

ఎర్రగుంట్ల : సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని కలమల్ల ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన చిన్నదుద్యాల, ఇల్లూరు, కలమల్ల మాలెపాడు గ్రామాలలో మంగళవారం ఆయన సాయుధ బలగాలతో పోలీస్ కవాతు నిర్వహించి మాట్లాడారు. జమ్మలమడుగు డీఎస్పీ యశ్వంత్ సూచనల మేరకు బలగాలతో గ్రామాలలోని అన్ని వీధులలో కవాతు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో క్రీడా పోటీలు ప్రారంభం

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇంటర్ సర్కిల్ కబడీ టగ్ ఆఫ్ వార్స్ క్రీడా పోటీలను మంగళవారం ఇంజనీరు సోమశేఖర్‌రెడ్డి పోటీలను ప్రారంభించి క్రీడా జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించారు. కార్యక్రమంలో సివిల్ పర్యవేక్షణ అధికారి శ్రీధర్, జీఎం ఫైనాన్స్ బాలాజీ, వెల్ఫేర్ అధికారి చార్లెస్, అసిస్టెంట్ స్పోర్ట్స్ అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'పోషణ్ పక్వాడ్'తో తల్లీ బిడ్డల సంరక్షణ

చక్రాయపేట : తల్లీ బిడ్డల సంరక్షణ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పోషణ్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహిస్తోందని వేంపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి సునిత తెలిపారు. మంగళవారం చక్రాయపేటలో ఆమె పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. 15 రోజుల పాటు సాగే ఈ కార్యక్రమం ద్వారా బాలింతలు, గర్భవతులు తీసుకోవలసిన జాగ్రత్తలు, పోషకాహారం, రక్తహీనత, ముర్రుపాలు తదితర వాటిపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. సూపర్‌వైజర్ నాగ సుభాషిణి, సీహెచ్‌వో వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి సహకరించండి



ప్రచారం చేస్తున్న ఆదిత్యరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

కాశినాయన: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పార్లమెంటు అభ్యర్థి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధ విజయానికి అందరూ సహకరించాలని ఆ పార్టీ యువ నాయకుడు దేవసాని ఆదిత్యరెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని అమగంపల్లె గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో సంక్షేమ పథకాల అమలులో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని తెలిపారు. ఈ సంక్షేమ పథకాలు మళ్లీ అమలు కావాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వేయించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ హనుమంతరెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్, ప్రభాకర్‌రెడ్డి, గురివిరెడ్డి, మారారెడ్డి, రమణారెడ్డి, ఉప సర్పంచ్ జిలాని, బూత్ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ అభిమానులు పాల్గొన్నారు.

కేజీబీవీ ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

మైదుకూరు: మైదుకూరులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ అప్లికేషన్లను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వై.విజయ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాలయంలో 6వ తరగతి 40 సీట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపీసీ 40 సీట్లు, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల కోసం అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనాథలు, బడిబయట పిల్లలు, బడిమానేసిన వారు, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్న బాలికలు ప్రవేశాలకు అర్హులని తెలిపారు. ప్రవేశాలకు ఏప్రిల్ 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థి ఆధార్ కార్డు, తల్లిదండ్రుల ఆధార్ కార్డు, రేషన్ కార్డు నంబర్, విద్యార్థి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, విద్యార్థి ఫొటో, స్టడీ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఎంపికైన విద్యార్థినులకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తామని పేర్కొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండి



మహిళలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న కల్యాణచక్రవర్తి, నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల: జగనన్న సంక్షేమ పథకాలు మరో ఐదేళ్లు ప్రతి ఇంటికి చేరాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని పీఆర్ఆర్‌డీ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి కోరారు. మంగళవారం గానుగపెంట పంచాయతీలో చిల్లావాండ్లపల్లె, గానుగపెంట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నతోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతుందని, చంద్రబాబు కూటమిని నమ్ముకుంటే నట్టేట మునిగి నట్టేనని పేర్కొన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీగా అవినాస్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా డాక్టర్ సుధను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో అమెరికన్ ఫుట్‌బాల్ ఇండియా టీమ్ కెప్టెన్ సందీప్‌రెడ్డి, ఆప్కాస్‌స్టేట్ డైరెక్టర్ డాక్టర్ కల్యాణ చక్రవర్తి, మండల ఉపాధ్యక్షులు చెన్ను రాజశేఖర్, డాక్టర్ మార్కారెడ్డి, సింగల్‌విండో అధ్యక్షులు వెంగల్‌రెడ్డి, సర్పంచ్ వీరభద్రుడు, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ డాక్టర్ మాబు, పార్టీ నాయకులు పి.కృష్ణారెడ్డి, ఫణీంద్రారెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉండాలనే ఆకాంక్షతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వాటి ద్వారా పేదలకు ఆర్థిక భరోసా లభించిందని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి తెలిపారు. కలమల్ల గ్రామంలోని పునరావాస కాలనీలో మంగళవారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలతో ప్రజలు పొందిన లబ్ధిని వివరించి మాట్లాడారు. ఎన్నో ఏళ్లగా వెంటాడుతున్న సమస్యలను ప్రజలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పరిష్కరించుకున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయలేనన్ని సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్ అందించి పేద కుటుంబాల్లో ఆనందం నింపారన్నారు. పాదయాత్రలో సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీలన్నింటిని నూరు శాతం నెరవేర్చారన్నారు. పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందరికీ అందించి వారి కుటుంబాల్లో వెలుగు నింపారన్నారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుందామని ప్రజలను కోరారు.

సువిధ యాప్‌లో నమోదు చేసుకోండి

పులివెందుల టౌన్ : ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ పార్టీ నాయకులు ర్యాలీలు, మీటింగులు, మైక్‌సెట్‌లు ఏర్పాటు చేసుకోవాలంటే సువిధ యాప్‌లో నమోదు చేసుకోవాలని ఆర్డీఓ వెంకటేశులు తెలిపారు. ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం అన్ని రాజకీయ పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకీయ పార్టీ నాయకులు ర్యాలీలు, సమావేశాలు, బ్యానర్లు ఏవైనా కట్టుకోవాలన్నా సువిద యాప్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. అర్బన్ సీఐ శంకర్‌రెడ్డి, రూరల్ సీఐ మద్దిలేటిలు మాట్లాడుతూ సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా పోస్టులు చేస్తే వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. గ్రూపుల అడ్మిన్లు జాగ్రత్తగా ఉండాలన్నారు. సొంత వెహికల్స్‌కు కూడా పర్మిషన్ తీసుకుని చెండాలు పెట్టుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు పర్మిషన్లు ఉండవన్నారు. పబ్లిక్‌లో ఉన్న రాజకీయ నాయకుల బొమ్మలను కనబడకుండా గుడ్డలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్, తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌లో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలి

కమలాపురం : ఐసీడీఎస్‌లో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐసీడీఎస్ కేటాయింపుల్లోని నిధులను, సెంటర్ల రెన్యువేషన్లో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ సెంటర్లకు సరఫరా చేసిన వస్తువులను బహిరంగ వేలం లేదా టెండర్ పిలవకుండా ఏకపక్షంగా ఎలా కొనుగోలు చేస్తారని ఆయన ప్రశ్నించారు. ఐసీడీఎస్ అధికారులు చేతివాటం ప్రదర్శించి కమీషన్ల కోసం కక్కుర్తి పడి వస్తువులు కొనుగోలు చేశారని ఆయన ఆరోపించారు. అవినీతికి పాల్పడిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

జిల్లాలోని 13 ప్రాజెక్ట్‌ల్లో 1030 సొంత భవనాలు ఉన్నాయన్నారు. ప్రతి సెంటర్ నిర్వహణకు ఏటా రూ.3వేలు మంజూరు చేస్తారని, అయితే గత ఏడాది నిధులు మంజూరు చేయక పోవడంతో ఈ ఏడాది రూ.6 వేలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఆ నగదును వర్కర్ల ఖాతాలో జమ చేశారన్నారు. అందులో రూ.3 వేలు వెనక్కు ఇవ్వాలని ఐసీడీఎస్ అధికారులు వర్కర్లకు హుకుం జారీ చేయడం వెనుక పరామర్థం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

కలిసికట్టుగా పనిచేయండి

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ



బూత్ కన్వీనర్లకు సామాగ్రిని అందజేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్లు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ సూచించారు. ఎన్నికలు ముగిసే వరకు ప్రజల్లోనే ఉండాలని అన్నారు. మంగళవారం స్థానిక నెల్లూరు రోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో బద్వేలు రూరల్, మున్సిపాలిటీలోని పలు వార్డుల బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులతో వేరువేరుగా నేను సిద్ధం – నా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమానికి పెద్దపీట వేశారని తెలిపారు. అవినీతి లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారనే విషయాన్ని ప్రజలకు వివరించాలని కోరారు. ఎన్నికలు ముగిసే వరకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని ముందుకు సాగాలని సూచించారు. అనంతరం ఆయా పంచాయతీల, వార్డుల బూత్ కన్వీనర్లకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులు ఆదిత్యారెడ్డి, కుడా చైర్మన్ గురుమోహన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, యద్దారెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు బిజ్జంరమణ, రమేష్‌బాబు, శ్రీనివాస్‌యాదవ్, ఆవులశ్రీను, అనిల్, రాజేష్, రమణ, జయరామిరెడ్డి, ఖాజా, ఓబులేసు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి వెంకటేశ్వరు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి

పోరుమామిళ్ల: రాష్ట్రంలో అన్నివర్గాల వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందించి.. ఆదుకున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ కొనియాడారు. మంగళవారం సాయంత్రం రంగసముద్రం పంచాయతీ గిరినగర్‌లో సర్పంచ్ రవిప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితే సంక్షేమ పథకాలు మరింత పెరుగుతాయన్నారు. ప్రజలందరూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని కోరారు. జెడ్పీటీసీ ప్రసాద్, యువనేత గిరి ప్రణీత్‌రెడ్డి, ఉపసర్పంచ్ నాగేంద్రప్రసాద్, ఎంపీటీసీ ఇస్సాక్, మాజీ సర్పంచ్ కొండయ్య, పార్టీ నాయకులు సురేష్‌బాబు, జగన్‌మోహన్, శ్రీనివాసాచారి, ఆచారి పాల్గొన్నారు.